
సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

సోమవారం, 1, మే, 2023



నిఘా కట్టుదిట్టం
గుట్కా, మట్కారాయుళ్లు, కర్ణాటక మద్యం తరలింపుదారులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. 8లో



టమాట కిలో రూ.7
కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట ధర గరిష్టంగా రూ.7, కనిష్టంగా రూ.3, సరాసరిన రూ.4.50 పలికింది.

గరిష్టం/కనిష్టం
38.9°/22.7°
జిల్లాలో ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా వర్షపాతం నమోదైంది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 8 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

ఆర్జిత కల్యాణోత్సవానికి పేర్లు నమోదు చేసుకోండి



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆర్జిత కల్యాణోత్సవ సేవకు సోమవారం నుంచి పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 1,8,10,12,14,15,16,17,18,21,22,23,24, 25,26 తేదీల్లో కల్యాణోత్సవం ఉంటుందన్నారు. రూ. 4 వేలు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఒక టికెట్‌పై ఐదుగురికి ప్రవేశం కల్పిస్తామని పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు సేవ ప్రారంభమవుతుందని తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని ఈఓ కోరారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

పుట్టపర్తి అర్బన్: 'వైఎస్సార్ పింఛన్ కానుక' పంపిణీ సోమవారం ప్రారంభమవుతుందని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని 32 మండలాల పరిధిలో 2,63,580 మంది లబ్ధిదారులు ఉన్నట్లు పేర్కొన్నారు. వారికి ప్రభుత్వం రూ.73,18,14,000 విడుదల చేసినట్లు వివరించారు. సచివాలయ ఉద్యోగులు నగదు డ్రా చేసి వలంటీర్ల ద్వారా అందజేయనున్నట్లు తెలిపారు. 5 రోజుల పాటు పింఛన్ పంపిణీ ఉంటుందని, ఇకపై ప్రత్యేకంగా ఇద్దరేసి సచివాలయ ఉద్యోగులు నగదు డ్రా చేయనున్నారని ఆయన ప్రకటనలో వెల్లడించారు.

నేడు 'స్పందన'



పుట్టపర్తి అర్బన్: కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10 గంటలకు స్పందన కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫిర్యాదులు అందజేసి పరిష్కారం కోరవచ్చన్నారు. డివిజన్, మండల స్థాయిలో సైతం కార్యక్రమం ఉంటుందన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. అర్జీలో ఫోన్ నంబర్ తప్పక పొందుపరచాలని, ఆధార్ జిరాక్సు అందజేయాలని సూచించారు.

25 మండలాల్లో వర్షం



పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని 25 మండలాల్లో ఆదివారం వర్షం పడిందని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. అత్యధికంగా గాండ్లపెంట మండలంలో 74.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. నల్లచెరువు 60.2, తనకల్లు 45.6, గుడిబండ 25.6, పరిగి 19.6, అమడగూరు 18.8, కదిరి 17.2, బుక్కపట్నం 16.8, పుట్టపర్తి 12.2, సోమందేపల్లి 10.4 మి.మీ వర్షం కురిసింది. వర్షంతో భూమి చల్లబడి ప్రజలకు ఉక్కపోత నుంచి ఉపశమనం లభించినట్లైంది.

సూడాన్ నుంచి కదిరికి క్షేమంగా..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు చెబుతున్న షాకీర్

కదిరి టౌన్: అంతర్యుద్ధంతో రావణకాష్టంలా మారిన ఆఫ్రికా దేశం సూడాన్ నుంచి కదిరి వాసి మల్లమీదపల్లి షాకీర్ ఆదివారం క్షేమంగా స్వగ్రామం చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సూడాన్‌లో చిక్కుకున్న భారతీయులు స్వదేశానికి తీసుకొచ్చేందుకు ఆపరేషన్ కావేరి పేరిట కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా సుడాన్ నుంచి విమానంలో బెంగళూరు చేరుకున్నామన్నారు. కలెక్టర్ అరుణ్‌బాబు, పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ, నల్లమాడ తహసీల్దార్ దేవేంద్రనాయక్, గోరంట్ల తహసీల్దార్ రంగనాయకులు ఆధ్వర్యంలోని స్పెషల్ టీమ్ బెంగుళూరు ఎయిర్‌పోర్టులో తమపై ప్రత్యేక శ్రద్ధ వహించి వసతులు సమకూర్చినట్లు పేర్కొన్నారు.

వంచించి.. డ్రామాలు!

నాడు..

పచ్చని పంట పొలాలను జేసీబీలతో ధ్వంసం చేశారు. అడ్డుకున్న రైతులను ఈడ్చుకెళ్లి మరీ అరెస్టు చేశారు. అప్పటి ఎమ్మెల్యే వరదాపురం సూరి అయితే రైతులపై రెచ్చిపోయారు. చెప్పుతో కొట్టండి.. ఈడ్చుకెళ్లండి అంటూ మీడియా ప్రతినిధుల ముందే బెదిరించారు. కోర్టులో స్టేటస్‌కో ఉన్నా లెక్క చేయలేదు. పైపెచ్చు అరకొర పరిహారం కోర్టులో డిపాజిట్ చేయించి వచ్చే ప్రభుత్వం సైతం బాధిత రైతులకు పరిహారం పెంచే వీల్లేకుండా చేశారు. ఈ విషయం జిల్లాలో ఎవరిని అడిగినా చెబుతారు.

నేడు..

బాధిత రైతుల కోసం ఇటీవల ధర్మవరం–పుట్టపర్తి ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న జగనన్న కాలనీలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి 8 ఎకరాలు ప్రత్యేకంగా కేటాయించారు. ఒక్కో బాధిత రైతుకు 5 సెంట్ల స్థలం ఇస్తామని భరోసా ఇచ్చారు. రైతులకు ఇచ్చే స్థలం విలువ బహిరంగ మార్కెట్‌లో ఒక్కో సెంటు రూ.4 లక్షల చొప్పున పలుకుతుండగా.. ఈ లెక్కన ఒక్కొక్కరికి రూ.20 లక్షల దాకా లబ్ధి చేకూరుతుండటంతో చాలా మంది అంగీకరించారు. 38 మంది దాకా కోర్టులో కేసులు ఉపసంహరించుకుని ప్లాట్లు తీసుకున్నారు.



టీడీపీ హయాంలో జేసీబీలతో పచ్చటి పంట పొలాలను ధ్వంసం చేస్తున్న దృశ్యం (ఫైల్)



అప్పట్లో భూసేకరణకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న మహిళా రైతులను బలవంతంగా పోలీసుస్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

టీడీపీ డర్టీ పాలిటిక్స్
- 2017లో రైతుల నుంచి బలవంతంగా భూసేకరణ
- చెప్పుతో కొట్టండి, ఈడ్చుకెళ్లండి అంటూ అన్నదాతలకు సూరి బెదిరింపు
- బాధితులకు ఆది నుంచి అండగా కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి
- ఇటీవల జగనన్న కాలనీలో 5 సెంట్ల కేటాయింపు
- ఆపన్నహస్తాన్ని ఓర్వలేక రోడ్డుపై నిరసన అంటూ టీడీపీ డ్రామాలు

ధర్మవరం: టీడీపీ ప్రభుత్వం ఉన్న 2017లో ధర్మవరం మండలం తుంపర్తి, పోతులనాగేపల్లి పరిధిలో 90 మంది రైతుల నుంచి 210 ఎకరాలు సేకరించాలని నిర్ణయించారు. దీన్ని వ్యతిరేకిస్తూ రైతులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. భూసేకరణ చేయకూడదంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇదిలా ఉండగానే అప్పటి టీడీపీ ఎమ్మెల్యే వరదాపురం సూరి పచ్చని పొలాలను పోలీసుల పహారాలో జేసీబీలతో ధ్వంసం చేయించారు. అరకొరగా పరిహారం కింద రూ.5 లక్షలు కోర్టులో డిపాజిట్ చేయించి బాధితులకు వచ్చే ప్రభుత్వం సైతం పరిహారం పెంచే వీల్లేకుండా చేశారు.

ఆది నుంచి అండగా కేతిరెడ్డి..

రైతుల నిరసనలకు మద్దతు ఇచ్చి అప్పట్లో కేతిరెడ్డి అండగా నిలిచారు. పలుమార్లు జిల్లా ఉన్నతాధికారులను కలిసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందన రాకపోవడంతో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే సాయం అందిస్తానని బాధితులకు భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే అయిన తర్వాత సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా.. బాధితుల ఖాతాల్లో వేయాల్సిన పరిహారాన్ని టీడీపీ ప్రభుత్వం డిపాజిట్ చేయడంతో ఇక పెంచే వీలులేదని తెలిసింది. దీంతో ప్రత్యామ్నాయంగా జగనన్న కాలనీలో ఒక్కో రైతుకు 5 సెంట్ల స్థలం ఇచ్చేలా చర్యలు తీసుకున్నారు. ఇలా అడుగడుగునా రైతులకు ఎమ్మెల్యే అండగా నిలవడం, ప్రభుత్వానికి ఆదరణ పెరుగుతుండడం ఓర్వలేని టీడీపీ నాయకులు కుట్రలకు తెరలేపారు. ఇటీవల జిల్లాలో సీఎం జగన్ పర్యటించినప్పుడు ఆయన కాన్వాయ్‌ను తమ పార్టీ అనుయాయులతో నిరసన పేరుతో అడ్డుకునేలా కుట్ర పన్నారు. నిజమైన రైతులు బయటకు రావడంతో వారి డ్రామా బట్టబయలైంది.

పాసుపుస్తకానికి 3 ప్లాట్లు



టీడీపీ హయాంలో కొంత పరిహారం కోర్టులో జమ చేయడంతో ఇప్పుడు పెంచడం సాధ్యం కాదు. ప్రత్యామ్నాయంగా ధర్మవరం–పుట్టపర్తి ప్రధాన రహదారి వద్ద ఉన్న జగనన్న లేఅవుట్‌లో ఒక్కో రైతు పాసుపుస్తకానికి 3 ప్లాట్లు చొప్పున ఇస్తాం. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
– తిప్పేనాయక్, ఆర్డీఓ, ధర్మవరం

గొప్పగా ఆలోచించారు



4 ఏళ్లుగా కోర్టులో పరిహారం పెంచాలని పోరాటం చేశాం. పరిహారం పెంచేందుకు వీలు లేకుండా చేయడంతో ప్రత్యామ్నాయంగా ఎంతో గొప్పగా ఆలోచించి ఇంటి స్థలాలు ఇస్తుంటే మళ్లీ రాజకీయాలు చేయడం బాధ కల్గిస్తోంది. టీడీపీ నాయకులు పద్ధతి మార్చుకోవాలి.
–నర్సింహులు, బాధితరైతు, మోటుమర్ల, ధర్మవరం మండలం

అరాచక కాండ కళ్లముందే ఉంది



టీడీపీ హయాంలో మాపై చేసిన అరాచకం ఇంకా కళ్లముందే ఉంది. అన్యాయాన్ని ఎండగడుతూ మాకు కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి చేసిన సాయం మరువలేము. ప్రభుత్వం తరపున 5 సెంట్ల స్థలం ఇస్తామంటే సంతోషంగా తీసుకున్నాం. మాకు పరిహారం ఇవ్వకుండా చేసిన టీడీపీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.
– ఎరికల రామయ్య, బాధిత రైతు, ధర్మవరం

దుష్ప్రచారం బాధ కల్గించింది



నా రెండెకరాలు దౌర్జన్యం చేసి లాక్కున్నారు. పోలీసులతో బెదిరించి అరెస్ట్ చేయించారు. అప్పట్లో కేతిరెడ్డి అండగా నిలిచి సాయమందించారు. అలాంటి వ్యక్తిపై నేడు దుష్ప్రచారం చేయడం బాధ కల్గించింది. ఇటీవల మాకు స్థలం ఇస్తానని భరోసా ఇవ్వడంతో కేసు వెనక్కి తీసుకునేందుకు వచ్చా.
– లక్ష్మీదేవి, బాధిత రైతు, మోటుమర్ల

కేసు వెనక్కు తీసుకుంటున్నాం



టీడీపీ హయాంలో ఎకరాకు కేవలం రూ.5 లక్షల పరిహారాన్ని కోర్టులో డిపాజిట్ చేసి ప్రస్తుత ప్రభుత్వం సాయం అందించే వీలు లేకుండా చేశారు. అయినప్పటికీ 5 సెంట్లు స్థలం ఇస్తామని కేతిరెడ్డి చెప్పిన మాటకు ఒప్పుకుని కేసు వెనక్కు చేసుకుంటున్నాం.
– చెన్నమ్మ, మోటుమర్ల

బడి తెరిచిన రోజే 'కానుక'!

- 'జగనన్న విద్యా కానుక'పై కసరత్తు మరూ
- ఇప్పటికే విద్యార్థుల కొలతల సేకరణ
- 2023–24 విద్యాసంవత్సరంలో సరికొత్త యూనిఫాం

కదిరి: గతంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, 2 జతల యూనిఫాం మాత్రమే ఇచ్చేవారు. అవి కూడా విద్యా సంవత్సరం ప్రారంభమై ఏడెనిమిది నెలలు గడిచినా అందేవి కావు. అయితే, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచే విద్యా రంగంలో సంస్కరణలు తీసుకొచ్చారు. బడి తెరిచే నాటికే కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, నోటు పుస్తకాలు, వర్కు బుక్కులు, బూట్లు, సాక్సులు, బెల్టుతో పాటు స్కూల్‌బ్యాగ్ అందించేలా 'జగనన్న విద్యా కానుక' పథకానికి శ్రీకారం చుట్టారు. కొందరు పిల్లలకు రెండు జతల యూనిఫాం సరిపోవడం లేదని గ్రహించిన ప్రభుత్వం ఇకపై మూడు జతలు ఇవ్వాలని నిర్ణయించింది. ఆ మేరకు 2023–24 విద్యాసంవత్సరంలో 'జగనన్న విద్యా కానుక' పంపిణీకి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 958.34 కోట్లు కేటాయించింది. బడి తెరిచిన మొదటి రోజే కిట్లు విద్యార్థులకు అందజేయాలని ప్రభుత్వం సంకల్పించింది.

నాణ్యతకు పెద్దపీట..

- జగన్న విద్యాకానుక కిట్‌లో మూడు జతల యూనిఫాం, జత బూట్లు, రెండు జతల సాక్సులు, స్కూల్ బ్యాగు ఉంటాయి. 1 నుంచి 10వ తరగతి వరకూ విద్యార్థులందరికీ ఇస్తారు.
- స్కూల్ బ్యాగులు 1–5వ తరగతి వరకూ మీడియం సైజు, 6–10 విద్యార్థులకు పెద్ద సైజ్ బ్యాగులు వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఇవ్వనున్నారు.
- బెల్టులు 1 నుంచి 5వ తరగతి వరకూ బాల, బాలికలందరికీ, 6–10 బాలురకు అందజేస్తారు.
- నోటు పుస్తకాలు 6–10వ తరగతి విద్యార్థులకు డిక్షనరీలు కూడా వీరికి అందిస్తారు.
- పాఠ్యపుస్తకాలు 1–10వ తరగతి విద్యార్థులకు, వర్క్‌బుక్‌లు 1–5వ తరగతి వారికి పంపిణీ చేస్తారు.
- కిట్ ద్వారా అందించే 8 రకాల వస్తువులు నాణ్యంగా ఉండేలా ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు తీసుకుంటోంది.

పర్యవేక్షణ కమిటీలు..


జగనన్న విద్యాకానుకలను పిల్లలకు అందించేందుకు ఈసారి జిల్లా వ్యాప్తంగా ప్రతి మండల కేంద్రంలో ఒక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేయనున్నారు. కిట్ల పంపిణీ పర్యవేక్షణకు ఒక కమిటీ కూడా నియమించారు. స్టాక్ పాయింట్ చైర్మన్‌గా మండల విద్యాశాఖాధికారి, కన్వీనర్‌గా హెచ్‌ఎం, సభ్యులుగా వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం, మండల ఇంజినీరు, సీఆర్‌పీలు ఉంటారు.



కిట్లు అందుకున్న పిల్లలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి(ఫైల్)

జిల్లాలో పాఠశాలలు, విద్యార్థుల వివరాలు		
ప్రాథమిక	1,553	51,330
ప్రాథమికోన్నత	230	20,125
ఉన్నత	306	89,888
మొత్తం	2,089	1,61,343

మంచి చేసే జగనన్నకే మద్దతు




సర్కారు బడులను జగనన్న సుందరంగా తీర్చిదిద్దారు. పిల్లలకు అన్నీ ఇవ్వడంతో పాటు మంచి భోజనం పెడుతున్నారు. తల్లి ఖాతాలో రూ. 15 వేలు జమ చేస్తున్నారు. ఇవన్నీ చూసి కొందరు ఓర్వలేకపోతున్నారు. మంచి చేసే జగన్‌కు మాలాంటి పేదోళ్ల మద్దతు ఎప్పటికీ ఉంటుంది.
– రవి నాయక్, తలుపుల

నాణ్యతలో రాజీ లేదు



'జగనన్న విద్యా కానుక' పథకం కింద అందించే బూట్లు, బ్యాగులు, పుస్తకాలు, దుస్తులు, బెల్టు వంటి వాటి నాణ్యత విషయంలో ప్రభుత్వం ఎక్కడా రాజీ పడలేదు. కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడులు, పిల్లలు ఉండాలనేది సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఆలోచన.
– ప్రతాప్‌రెడ్డి, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్

సెలవుల్లోనే స్టాక్ పాయింట్లకు



పాఠశాలల పునః ప్రారంభం రోజే కిట్లు పిల్లలకు అందజేయానే లక్ష్యంతో ముందుకెళుతున్నాం. వాటికి సంబంధించి ఇప్పటికే కొన్ని వస్తువులు మండల కేంద్రాలకు చేరాయి. ఇంకొన్ని రావాల్సి ఉన్నాయి. వేసవి సెలవుల్లో అన్నీ స్టాక్ పాయింట్లకు చేరుకుంటాయి.
– మీనాక్షి, డీఈఓ

పోలీస్ వ్యవస్థకు మచ్చతెస్తే చర్యలు

- ఎస్పీ మాధవ రెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ మాధవ రెడ్డి

కొత్తచెరువు: పోలీస్ వ్యవస్థకు మచ్చతెస్తే చర్యలు తప్పవని ఎస్పీ ఎస్.వి.మాధవ రెడ్డి హెచ్చరించారు. ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో డీఎస్పీ, సీఐలతో నేరసమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతిని ఉపేక్షించనని తెలిపారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్‌లను రూపుమాపాలన్నారు. సంవత్సరంలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో బద్ధకం వీడి విధులు నిర్వర్తించాలన్నారు. నిరంతరం అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. హెడ్ క్వార్టర్‌లోనే నివాసం ఉండేలా చూసుకోవాలన్నారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, సీసీ నంబర్లు వచ్చేలా చూడాలన్నారు. తీవ్రమైన కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా వ్యవహరించాలన్నారు. సైబర్ క్రైంపై ప్రత్యేక దృష్టి సారించి బాధితులకు న్యాయం చేయాలన్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వారెంట్ల విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, కోర్టులో విత్‌డ్రా కోసం ఫైల్ చేయాలన్నారు. లాకప్ గదులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫ్యాక్షన్ ప్రభావిత, సమస్యాత్మక ప్రాంతాల్లో సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ–చలానాల్లో వీలైనంతవరకు అపరాధ రుసుం వసూలు చేయాలన్నారు. మహిళా పోలీసుల సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలన్నారు. రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. స్పందన పిటిషన్లపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళల కోసం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం బదిలీపై వెళ్తున్న డీఎస్పీలు భవ్యకిషోర్, టీడీ యశ్వంత్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రామకృష్ణ ప్రసాద్, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, డీఎస్పీ హుసేన్ పీరా, ఎస్‌బీ డీఎస్పీ ఉమామహేశ్వర్ రెడ్డి, సీఐ రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక రథంతో బ్రహ్మోత్సవాలు

- దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు వెల్లడి



దెబ్బతిన్న రథాన్ని పరిశీలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు

ఉరవకొండ: తాత్కాలిక రథం తెప్పించి పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు తెలిపారు. 400 ఏళ్ల నాటి రథానికి శనివారం చక్రాలు మార్చే క్రమంలో ఒరిగి కుప్పకూలిపోయింది. దెబ్బతిన్న రథాన్ని ఆదివారం స్థానిక దేవదాయ అధికారులతో కలసి అసిస్టెంట్ కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో తేదీ నుంచి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పదో తేదీన బ్రహ్మ రథోత్సవానికి తాత్కాలికంగా మరో రథాన్ని తెప్పిస్తున్నామన్నారు. కొత్త రథం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపుతామన్నారు. నూతన రథం కోసం భక్తులు ఇచ్చిన రూ.74 లక్షల విరాళాలు సిద్ధంగా ఉన్నాయని, ఎవరూ ఆందోళనకు గురికావసరం లేదని తెలిపారు. భక్తులు యథావిధిగా పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ విజయ్‌కుమార్, ప్రధాన అర్చకులు ద్వారకనాథాచార్యులు, బాలాజీ స్వామి తదితరులు పాల్గొన్నారు.



హనుమ విహారా.. చెన్నకేశవా..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ధర్మవరంలో లక్ష్మీచెన్నకేశవస్వామి కల్పవృక్ష, హనుమద్వాహనాలపై ఊరేగారు. పట్టణ పురవీధుల్లో ఉదయం కల్పవృక్ష వాహనంపై ఊరేగిన చెన్నకేశవుడు సాయంత్రం హనుమద్వాహనంపై కొలువుదీరి భక్తులను కటాక్షించారు. స్వామివారికి అడుగడుగునా స్థానికులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు కోనేరాచార్యులు, భానుప్రకాష్ స్వామి ఉత్సవ విగ్రహాలకు శాస్త్రోక్తంగా వేదమంత్రాల మధ్య ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. సోమవారం ఉదయం పుష్ప మంటపం, సాయంత్రం కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ దాసెట్టి సుబ్రహ్మణ్యం తెలిపారు.
– ధర్మవరం అర్బన్:

← హనుమ వాహనంపై కొలువైన లక్ష్మీచెన్నకేశవస్వామి

సాఫ్ట్‌బాల్ ఏషియన్ పోటీలకు రైతుకూలీ బిడ్డ



శివకుమార్

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఈ ఏడాది జూన్ 21 నుంచి 24వ తేదీ వరకూ జపాన్‌లో జరిగే అంతర్జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీలకు పెనుకొండ మండలం గుట్టూరు గ్రామానికి చెందిన రైతు కూలీ ఈశ్వరయ్య, నాగేంద్రమ్మ దంపతుల కుమారుడు శివకుమార్ ఎంపికయ్యాడు. శివకుమార్ తల్లిదండ్రులు వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. పూట గడవడమే కష్టంగా ఉన్న రోజుల్లోనూ కుమారుడి చదువులను ఆపలేదు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించిన శివకుమార్ పట్టుదలతో చదువుకుని, ప్రస్తుతం బీపీఈడీ విద్య అభ్యసిస్తున్నాడు. గుట్టూరు ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నప్పుడు పీడీ నాగేంద్ర అతనిలోని ప్రతిభ గుర్తించి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక చేశాడు. ఈ ఏడాది అనంత ఆర్డీటీ క్రీడా మైదానంలో నిర్వహించిన ఎంపికల్లో సత్తా చాటి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.

క్లుప్తంగా

నందీశ్వరాలయంలో చోరీ

ఓడీ చెరువు: మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్ సమీపంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న హరిహర నందీశ్వరాలయంలో దుండగులు చొరబడి హుండీ కానుకలను అపహరించుకెళ్లారు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. ఆదివారం ఉదయం ఆలయంలో పూజలు చేసేందుకు వెళ్లిన అర్చకుడు రంగనాథశర్మ... చోరీ విషయాన్ని గుర్తించి ఆలయ ధర్మకర్త వంచిరెడ్డి కృష్ణారెడ్డికి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆలయం వద్దకు చేరుకుని పరిశీలించారు. ఆలయం తలుపులు బద్ధలుగొట్టి లోపలకు ప్రవేశించిన దుండగులు మూడు హుండీలను ధ్వంసం చేసి అందులో ఉన్న నగదును దోచుకున్నారు.అనంతరం బీరువాలను బద్ధలుగొట్టి అందులోని వస్తువులను చిందరవందర చేశారు. సీసీ ఫుటేజీల ఆధారంగా ఆలయ ధర్మకర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. ముగ్గురు యువకులు చోరీకి పాల్పడినట్లుగా సీసీ కెమెరా ఫుటేజీల్లో నిక్షిప్తమైనట్లు ఎస్‌ఐ గోపి తెలిపారు.

పట్టుబడ్డ దొంగలు



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

సోమందేపల్లి: విద్యుత్ కండక్టర్‌ను అపహరించుకెళ్లిన కేసులో ఐదుగురు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సోమందేపల్లి ఎస్‌ఐ విజయ్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. సోమందేపల్లి మండలం ఈదులబళాపురం నుంచి గోరంట్ల మండలానికి 420 కేవీ విద్యుత్ లైన్ పనులు జరుగుతున్నాయి. ఇందుకు సంబంధించిన కండక్టర్ (విద్యుత్ లైన్‌కు ఉపయోగించే అల్యూమినియం తీగ)ను మంచేపల్లి సమీపంలో భారీగా నిల్వ చేశారు. గత నెల 25న గుడిపల్లికి చెందిన వెంకటేష్, గోపాల్, నరేంద్ర, ఈడిగ వెంకటేష్, నరేష్... దాదాపు 220 మీటర్ల కండక్టర్‌ను అపహరించుకెళ్లారు. ఘటనపై అప్పట్లో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు పక్కా ఆధారాలతో నిందితులను గుర్తించి, రూ.95 వేలు విలువ చేసే కండక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఎదుట హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధుడి దుర్మరణం

రామగిరి: మండలంలోని ఎగువపల్లి సమీపంలో ఆదివారం రాత్రి చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వృద్ధుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... రామగిరి మండలం పోలేపల్లికి చెందిన ఆంజనేయులు (65)కు భార్య గంగమ్మ, ఇద్దరు కుమారులున్నారు. ఆదివారం ఉదయం వ్యక్తిగత పనిపై కంబదూరుకు వెళ్లిన ఆంజనేయులు రాత్రికి ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమయ్యాడు. చీకట్లో రామగిరి మండలం ఎగువపల్లి సమీపంలో మలుపును గుర్తించలేక వేగంగా దూసుకెళ్లడంతో వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో ఆంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు పరిశీలించి, కేసు నమోదు చేశారు.

సరిహద్దులో నిఘా కట్టుదిట్టం

- రేషన్ బియ్యం, గుట్కా, గ్యాంబ్లింగ్, మట్కా, కర్ణాటక మద్యం తరలింపుదారులపై కఠిన చర్యలు
- 11 పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎక్కడికక్కడ కేసుల నమోదు



గోరంట్లలో పట్టుబడ్డ రేషన్ బియ్యాన్ని చూపుతున్న అధికారులు (ఫైల్)

సాక్షి, పుట్టపర్తి: జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల్లో పోలీసుల నిఘా మరింత పెరిగింది. మట్కా, గుట్కా, గ్యాంబ్లింగ్, క్రికెట్ బెట్టింగ్, కర్ణాటక మద్యం అక్రమ రవాణా, కోడిపందేలు, రేషన్ బియ్యం అక్రమ తరలింపు తదితర వాటిపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. నిబంధనల విషయంలో రాజీ పడకుండా కేసులు నమోదు చేశారు. ఏడాది వ్యవధిలో పెనుకొండ సబ్ డివిజన్ పరిధిలో గ్యాంబ్లింగ్ కేసులు అత్యధికంగా నమోదయ్యాయి. మొత్తం 11 పోలీస్ స్టేషన్ల పరిధిలో 405 కేసులు నమోదు కాగా, అత్యధికంగా అగళిలో 117, గోరంట్లలో 85, సోమందేపల్లిలో 67, మడకశిరలో 60 కేసులు ఉన్నాయి. తర్వాతి స్థానాల్లో గుడిబండలో 29, పెనుకొండలో 11, పరిగిలో 11, రొద్దంలో 10, అమరాపురంలో 10, రొళ్లలో 4, కియా పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ కేసు నమోదైంది. కర్ణాటక సమీపంలోని అగళి మండలంలో గ్యాంబ్లింగ్ కేసులు అధికంగా నమోదు కావడం విశేషం.

కర్ణాటక మద్యంపై ఉక్కుపాదం

పెనుకొండ పోలీసు సబ్ డివిజన్ పరిధిలో పెనుకొండ, రొద్దం, సోమందేపల్లి, కియా, పరిగి, గోరంట్ల, మడకశిర, రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం మండలాలున్నాయి. ప్రధానంగా కర్ణాటక నుంచి జిల్లాలోకి అక్రమంగా మద్యం తరలించాలంటే ఈ మండలాల మీదుగానే ప్రయాణించాల్సి ఉంది. దీంతో కర్ణాటక మద్యం జిల్లాలోకి చొరబడకుండా పోలీసులు పటిష్ట చర్యలు తీసుకున్నారు. కేవలం కర్ణాటక మద్యం అక్రమ తరలింపులకు సంబంధించి పెనుకొండ సబ్ డివిజన్ పరిధిలో ఏడాదిలో 195 కేసులు నమోదయ్యాయి. ఇందులో 215 మందిని పోలీసులు అరెస్ట్ చూపించారు. అలాగే 2,588 లీటర్ల మద్యాన్ని ధ్వంసం చేశారు. గోరంట్ల పరిధిలో అత్యధికంగా 54 కేసులు నమోదు కాగా, సోమందేపల్లిలో 23, పరిగిలో 20, అమరాపురంలో 18, గుడిబండలో 17, అగళిలో 17, మడకశిరలో 15, రొద్దంలో 14, పెనుకొండలో 12, రొళ్లలో 3, కియా పోలీస్ స్టేషన్‌లో రెండు చొప్పున కేసులున్నాయి.

నమోదైన వివిధ కేసులు

- మట్కా కేసులు 51 నమోదు కాగా.. అమరాపురంలో 14, గోరంట్లలో 13, సోమందేపల్లిలో 7, రొద్దంలో 6, గుడిబండలో 5, మడకశిరలో 4, పెనుకొండ, అగళిలో ఒకటి చొప్పున ఉన్నాయి.
- నిషేధిత గుట్కా తరలింపులపై 58 కేసులు నమోదయ్యాయి. ఇందులో పెనుకొండలో 11, రొద్దంలో 11, అగళిలో 9, గుడిబండలో 6, అమరాపురంలో 6, కియాలో 4, రొళ్లలో 4, మడకశిరలో 3, గోరంట్లలో 2, పరిగి, సోమందేపల్లిలో ఒకటి చొప్పున నమోదయ్యాయి.
- క్రికెట్ బెట్టింగ్‌కు సంబంధించి పరిగిలో రెండు, రొద్దంలో ఒక కేసు నమోదు కాగా, మొత్తం ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు.
- కోడిపందేల నిర్వహణపై మొత్తం 44 కేసులు నమోదు కాగా, ఒక్క గోరంట్లలోనే 42 కేసులు ఉండడం గమనార్హం. రొద్దం, అగళిలో ఒక్కో కేసు చొప్పున ఉన్నాయి.
- రేషన్ బియ్యం అక్రమ తరలింపులకు సంబంధించి సోమందేపల్లిలో 7, గుడిబండలో 4, మడకశిరలో 4, రొద్దలో 3, కియాలో 2, పెనుకొండ, అగళి, అమరాపురంలో ఒకటి చొప్పున మొత్తం 23 కేసులు నమోదయ్యాయి.

పెనుకొండ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో ఏడాదిలో నమోదైన కేసుల వివరాలు

మట్కా:	51
గుట్కా:	58
గ్యాంబ్లింగ్:	405
క్రికెట్ బెట్టింగ్‌పై	3
ఎక్సైజ్	195
ఇసుక	48
కోడిపందేలు	44
పీడీఎస్ బియ్యం	23

ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



నిబంధనలు ఎవరు ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవు. పొరుగు రాష్ట్రంలో ఎన్నికల నేపథ్యంలో భద్రత మరింత కట్టుదిట్టం చేశాం. నిబంధనలకు లోబడే ఎవరైనా రాకపోకలు సాగించాలి. తనిఖీలకు ప్రజలు కూడా సహకరించాలి.

– హుస్సేన్‌పీరా, పెనుకొండ డీఎస్పీ

అగ్రవర్ణ పేదలకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న ఓసీ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి

ధర్మవరం: ఏడు దశాబ్దాలుగా అమలవుతున్న విద్య, ఉద్యోగ రిజర్వేషన్లను సమీక్షించి అగ్రవర్ణ పేదలకు న్యాయం చేయాలని ఓసీ సంఘం జాతీయ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, రెడ్డి జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామాటం శేషాద్రిరెడ్డి డిమాండ్ చేశారు. ధర్మవరంలోని రెడ్డి జేఏసీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రిజర్వేషన్ల వ్యవస్థ ప్రారంభమైనప్పటి నుంచి సామాజిక న్యాయం పేరుతో అన్ని రంగాల్లో అగ్రవర్ణ పేదలు అణచివేతకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్థిక వెనుకబాటు ప్రాతిపదికన అగ్రవర్ణ పేదలను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. నాలుగేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ ద్వారా చేపట్టిన ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు చరిత్రాత్మకమన్నారు. ఇతర సామాజిక వర్గాలకు కష్టం కలగకుండా అమలవుతున్న ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కొన్ని ప్రజా సంఘాలు రాజకీయ పార్టీలు వ్యతిరేకించడం దారుణమన్నారు. ఇతర సామాజిక వర్గాలకు కార్పొరేషన్ కేటాయించి ఆదుకుంటున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అగ్రవర్ణాల సంక్షేమం కోసం జాతీయస్థాయిలో రూ.లక్ష కోట్లతో కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రెడ్డి జేఏసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో విజయం మనదే

- జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ వెన్నపూస రవీంద్రారెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న వెన్నపూస రవీంద్రారెడ్డి

పెనుకొండ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని స్థానాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలుపొందడం ఖాయమని ఆ పార్టీ నాయకుడు, జెడ్పీ ఫ్లోర్ మాజీ లీడర్ వెన్నపూస రవీంద్రారెడ్డి స్పష్టం చేశారు. పెనుకొండలో ఆదివారం జరిగిన ఓ శుభకార్యానికి హాజరైన ఆయన.. స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు, ఎమ్మెల్యే ఎన్నికలకు చాలా వ్యత్యాసం ఉంటుందన్నారు. తొలి ప్రాధాన్యత ఓట్లతో తాను ముందంజలో ఉన్నా.. రెండో ప్రాధాన్యత ఓట్లతో టీడీపీ అభ్యర్థి గెలుపొందినట్లు వివరించారు. ఈ సౌలభ్యం శాసన సభ ఎన్నికలకు ఉండదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయన్నారు. చంద్రబాబు గిమ్మిక్కులను ప్రజలు ఎవరూ నమ్మడం లేదన్నారు.

ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

ప్రశాంతి నిలయం: ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు డీవైఈఓ రఘునాథరెడ్డి తెలిపారు. ఈ నెల 1 నుంచి 20వ తేదీ వరకూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసే శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు ఆయన పిలుపునిచ్చారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మొదటి సంవత్సరం విద్యార్థులకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు శిక్షణ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. ఏ కళాశాలలో ఇంటర్ చదివారో అదే కళాశాలలో శిక్షణ తరగతులకు హాజరు కావచ్చునన్నారు.

జానపద సాహితీ పిపాసి 'చిగిచర్ల'



చిగిచర్ల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

- తొమ్మిది గ్రంథాల ఆవిష్కరణలో వక్తలు

అనంతపురం కల్చరల్: గ్రామీణుల జీవితాలపై జానపద కథలు వెలువరించి ఎంతో మందిని ఆకట్టుకున్న చిగిచర్ల కృష్ణారెడ్డి వంటి సాహితీ పిపాసులు అరుదుగా ఉంటారని పలువురు వక్తలన్నారు. ఆచార్య చిగిచర్ల కృష్ణారెడ్డి రచించిన తొమ్మిది పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం అనంతపురంలోని ఎన్జీఓ హోమ్‌లో నిర్వహించారు. ఏపీ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అరసం జిల్లా అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మాజీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, మాజీ వీసీ కాడా రామకృష్ణారెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, డాక్టర్ శాంతి నారాయణ, జనప్రియ కవి ఏలూరు యంగన్న తదితరులు మాట్లాడారు. గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలు, జానపద కళలను వెలుగులోకి తెచ్చిన చిగిచర్ల కృషిని అభినందించారు. ఆచార్య చిగిచర్ల మాట్లాడుతూ... జిల్లా కళావైభవాన్ని తెలుగు సాహితీలోకానికి అందించాలన్న తపనతో తొమ్మిది గ్రంథాలను రచించినట్లు పేర్కొన్నారు. అనంతరం తొమ్మిది గ్రంథాలను సాహితీవేత్తలు డాక్టర్ హేమమాలిని, నాగేశ్వరాచారి, వెంకటేశ్వర ప్రసాద్ తదితరులు పరిచయం చేసి వాటి ఔన్నత్యాన్ని వివరించారు. కార్యక్రమంలో రాజారాం, నానీల నాగేంద్ర, పూజారి ఈరన్న, తన్నీరు నాగేంద్ర, టీవీరెడ్డి, డాక్టర్ అనితమ్మ, నబీరసూల్ తదితరులు పాల్గొన్నారు.

తూకాల్లో మోసంపై జరిమానా విధింపు

సాక్షి ఎఫెక్ట్..



బియ్యం బస్తాను తూకం వేస్తున్న అధికారి

ధర్మవరం అర్బన్: తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్‌గౌస్ పేర్కొన్నారు. 'తూకం.. అంతా మోసం' శీర్షికతో ఏప్రిల్ 12న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. ఆదివారం ధర్మవరంలోని బియ్యం హోల్‌సేల్ దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. బియ్యం బస్తాలు తూకం వేసి పరిశీలించారు. 26 కిలోల బస్తాలో 25కేజీలు, 25కేజీల బస్తాలో 24 కేజీలు బియ్యం ఉన్నట్లు గుర్తించారు. తూకాల్లో మోసాలతో పాటు 25కేజీల బియ్యం బస్తాలపై ఉత్పత్తి దారు వివరాలు ముద్రించకపోవడంపై రెండు కేసులు నమోదు చేసి రూ.లక్ష జరిమానా విధించారు.

మద్యం తాగడానికి డబ్బు ఇవ్వలేదని ఆత్మహత్య



ఓం ప్రకాష్ (ఫైల్)

తనకల్లు: మద్యం తాగడానికి డబ్బు ఇవ్వకపోవడంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... తనకల్లు మండలం బొంతలపల్లికి చెందిన రవీంద్రారెడ్డి కుమారుడు ఓంప్రకాష్ (37).. తండ్రితో కలసి వ్యవసాయ పనులు చేస్తుంటాడు. 2016లో మదనపల్లికి చెందిన శ్రావణితో వివాహమైంది. పిల్లలు కలగకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. కుటుంబసభ్యులు ఎంతగా నచ్చచెప్పినా మద్యం అలవాటు మానలేదు. దీంతో మనస్తాపం చెందిన శ్రావణి భర్తను వదిలేసి పుట్టింటికి వెళ్లింది. ఏప్రిల్ 27న మద్యం తాగడానికి డబ్బు కావాలని తల్లి మంజులను ఓంప్రకాష్ అడిగాడు. తన వద్ద లేవని ఆమె తెలపడంతో గొడవపడి ఇల్లు విడిచి వెళ్లాడు. అదే రోజు రాత్రి తిరిగి ఇంటికి చేరుకున్న ఓం ప్రకాష్ మద్యం తాగడానికి డబ్బు ఇవ్వకపోవడంతో పురుగుల మందు తాగి వచ్చినట్లు తెలిపి, వాంతులు చేసుకోసాగాడు. కుటుంబసభ్యులు వెంటనే కదిరి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స అనంతరం వైద్యులు డిశ్చార్జ్ చేశారు. పరిస్థితి అలాగే ఉండడంతో ఏప్రిల్ 29న మదనపల్లిలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం బెంగుళూరులోని కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్సకు స్పందించక ఆదివారం ఓంప్రకాష్ మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాంభూపాల్ తెలిపారు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చక్రాయపేట: మండలంలోని ఎర్రబొమ్మనపల్లె గ్రామం కోలెకణం వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో అజమతుల్లా(45) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కదిరి పట్టణానికి చెందిన అజమతుల్లా ఉదయం 5 గంటలకు తన ద్విచక్రవాహనంలో పెండ్లిమర్రి మండలం నందిమండలానికి తాటి ముంజల కొనుగోలుకు బయలుదేరాడు. కోలేఖనం వద్దకు చేరుకోగానే స్కూటీ అదుపు తప్పి కిందపడ్డాడు. దీంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సుమీయ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మల్లికార్జున రెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

డ్రైవర్ సమయస్ఫూర్తి.. తప్పిన ప్రాణాపాయం



నుజ్జునుజ్జైన ద్విచక్ర వాహనం

పెనుకొండ: డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరికి ప్రాణాపాయం తప్పింది. పోలీసులు తెలిపిన మేరకు... పెనుకొండకు చెందిన ఓ పదో తరగతి విద్యార్థిని ద్విచక్ర వాహనం నేర్చుకునే క్రమంలో తమ సమీప బంధువైన మారుతితో కలసి 44వ జాతీయ రహదారిపైకి చేరుకుంది. అదే సమయంలో బెంగుళూరు నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న తెలంగాణ ఆర్టీసీ (గరుడ) బస్సు డ్రైవర్.. ఉన్నఫళంగా రోడ్డుపైకి చేరుకున్న ద్విచక్ర వాహనాన్ని గమనించి వెంటనే బస్సును కుడి వైపునకు తిప్పాడు. ఒక్కసారిగా బస్సు ఊగిసలాటకు గురి కావడంతో ప్రయాణికులు హాహాకారాలు పెట్టారు. అదే సమయంలో ద్విచక్ర వాహనాన్ని బస్సు తాకింది. ఘటనలో విద్యార్థినికి ఎలాంటి గాయాలు కాలేదు. వాహనంలో వెనుక కూర్చొన్న మారుతికి స్వల్ప గాయాలయ్యాయి. సడన్ బ్రేక్ వేయడంతో బస్‌లోని ప్రయాణికులు సీట్లలో నుంచి కిందపడ్డారు. అనంతరం జరిగిన ఘటనను తెలుసుకుని ప్రమాదానికి కారణమైన విద్యార్థినిని, మారుతిని మందలించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనలో నుజ్జునుజ్జైన ద్విచక్ర వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.